
క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే శిల్పాకు పౌర సన్మానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భూములు తిరిగి దేవస్థానానికే అప్పగించడంలో అహర్నిషలు కృషి చేసిన శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి శనివారం శ్రీశైలంలో పౌరసన్మానం చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ రజాక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాసవీసత్రంలో సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్న సన్మాన కార్యక్రమానికి స్థానికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

శివతత్వంపై ప్రవచనం



శివతత్వంపై ప్రవచనాన్ని వినిపిస్తున్న మల్లేశ్వర ఆచార్య

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలో నిత్యకళావేదికపై అమలాపురానికి చెందిన బల్ల మల్లేశ్వర ఆచార్య వారిచే శివతత్వంపై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ధర్మపథం కార్యక్రమాలు దేవస్థానం నిర్వహిస్తోంది.

ఉచిత పాలీ సెట్ కోచింగ్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా పాలీ సెట్ ఎంట్రెన్స్ టెస్ట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.రంగయ్య శుక్రవారం తెలిపారు. జిల్లా, డివిజన్ కేంద్రాలకు దూరంగా ఉన్న శ్రీశైలం మండల విద్యార్థుల సౌకర్యార్థం ఈనెల 24 నుంచి కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకుసెల్.9985061184, 9912342068 లకు సంప్రదించాలని తెలిపారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానందిలో పల్లకిసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం పాడ్యమి తిథి సందర్భంగా శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌ల ఆధ్వర్యంలో ఆలయ పండితులు రవిశంకర అవధాని, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు స్వామివారి అలంకార మండపంలో విశేష అలంకరణ, అర్చనలు, హారతులు చేపట్టిన అనంతరం గోమాతను ముందుంచి పల్లకీ ఉత్సవం జరిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పంజాబ్ యువకుడి అనుమానాస్పద మృతి



అజయ్ మృతదేహం

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామ సమీపంలో శంకరమల్లయ్యస్వామి గుడి దగ్గరలో ఉన్న గదిలో పంజాబ్‌కు చెందిన యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాలు.. తూడిచెర్ల గ్రామానికి చెందిన చిన్న దస్తగిరి, పెద్ద దస్తగిరితో పాటు మరో ఇద్దరికి పంటకోత మిషన్‌లు ఉన్నాయి. వీటికి ఆపరేటర్లుగా, హెల్పర్‌గా పంజాబ్‌కు చెందిన అజయ్(23)తో పాటు మరో ముగ్గురు యువకులు పనిచేస్తున్నారు. వారందరూ శంకరమల్లయ్యస్వామి గుడి సమీపంలో ఉన్న గదుల్లో ఉంటూ పంట కోతమిషన్ పనులకు వెళ్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం అజయ్ అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మూడు రోజుల నుంచి వడదెబ్బతో బాధపడున్నాడని, స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చూపించినా కోలుకోలేక మృతిచెందాడని కొంత మంది గ్రామస్తులు పేర్కొంటున్నా.. మృతుని ఎడమ కంటిరెప్ప, ముక్కుపై గాయాలుండటం, ముక్కులోంచి రక్తం కారినట్లు ఉండటం చూస్తే అజయ్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా విషయం తెలుసుకున్న వీఆర్వో అద్దాకుల మనోహర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్‌పూర్ జిల్లా టిబ్బికలన్ గ్రామానికి తరలించారు.

పఠనాసక్తిని పెంపొందించాలి

నంద్యాల(సిటీ): వేసవి సెలవులలో విద్యార్థుల సమయం వృథా కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి వారిలో పఠనాశక్తి పెంపొందించుకునేలా చర్యలు చేపట్టాలని డీఈఓ అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఆదేశాల మేరకు మే 1నుంచి జూన్ 10వ తేదీ వరకు వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లాలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కార్యక్రమాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

నిండా నిర్లక్ష్యం

- వృథాగా రూ.లక్షల విలువైన ధాన్యం నూర్పిడి పరికరాలు
- ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పపడుతున్న యంత్రాలు
- పట్టించుకోని తంగడంచ ఫారం అధికారులు



జూపాడుబంగ్లా: అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షల విలువ చేసే యంత్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. చిన్నచిన్న మరమ్మతులు చేయించి ఉపయోగించుకోవాల్సిన విలువైన యంత్రాలను ఆరుబయట పడేయడంతో ఎండకు ఎండి, వానకు నాని తుప్పు పట్టిపోతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులైనా స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. తంగడంచ ఫారంలో ఉత్పత్తి చేసిన విత్తనాలను సీడ్ ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేసే రూ.లక్షల విలువైన ఆధునిక యంత్ర పరికరాలు అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల నిరుపయోగంగా మారాయి. 1362.63 ఎకరాల్లో విస్తరించి ఉన్న తంగడంచ ఫారంలో నాణ్యమైన బ్రీడర్, ఫౌండేషన్ సీడ్స్ ఉత్పత్తి చేసేవారు. ఉత్పత్తిచేసిన విత్తనాల్లో చెత్తాచెదారం, తాళ్ల గింజలు లేకుండా సీడ్‌ప్రాసెసింగ్ చేసి సీడ్‌విలేజ్ ప్రోగ్రాం కింద ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విక్రయించేవారు. అందుకుగాను ప్రభుత్వం ప్యాడీ సీడ్‌గ్రేడర్(వరి ధాన్యం నూర్పిడి యంత్రం), శనగలు, కందులు సీడ్‌ప్రాసెసింగ్ చేసే ఆధునిక టెక్నాలజీతో



అధునాతన టెక్నాలజీతో కూడిన ప్యాడీ సీడ్ గ్రేడర్

కూడిన యంత్రాలను ఫారానికి మంజూరు చేశారు. వాటిని ఉపయోగించి నాలుగేళ్ల క్రితం వరకు సీడ్స్ ప్రాసెసింగ్ చేశారు. అనంతరం వాటి పర్యవేక్షణ లోపించటం, వాడకం తగ్గిపోవటంతో యంత్రాలు తుప్పు పట్టిపోతున్నాయి. చిన్నచిన్న మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు వాటిని గోదాము బయట పడేశారు. దీంతో అవి ఎండకు ఎండి, వానకు తడవటంతో తుప్పుపడుతున్నాయి. ప్రస్తుతం ఫారంలో సీడ్ ప్రాసెసింగ్ యంత్రాల్లేవంటూ ఫారంలో పండించిన విత్తనాలను డబ్బు వెచ్చించి ప్రైవేట్ వ్యక్తుల వద్ద సీడ్స్ ప్రాసెసింగ్ చేయిస్తున్నారు. ఇలా చేయటం వల్ల సీడ్స్ పక్కదారి పట్టే అవకాశాలున్నాయనే ఆరోపణలున్నాయి. జిల్లా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుని ఫారంలో నిరుపయోగంగా ఉన్న యంత్రపరికరాలు ఉపయోగంలోకి తీసుకవచ్చి వృథా ఖర్చుల భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిరుపయోగంగా ఉన్న విలువైన యంత్రం

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దు



మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీఓ గౌరీబాయి

జూపాడుబంగ్లా: ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దని ఏపీఓ గౌరీబాయి ఫీల్డ్‌అసిస్టెంట్లు, మేట్లకు సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపాడు గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 6 గంటల్లోగా పనులు ప్రారంభించి పది గంటల్లోగా పనులు ముగించుకోవాలని కూలీలకు సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేసి గరిష్టస్థాయి కూలీని పొందాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లింగన్న, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

వృత్తినైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలి



ఐటీడీఏ అధికారులతో చర్చిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ వినోద్‌కుమార్

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజన యువతకు వృత్తి నైపుణ్యాలపై మరిన్ని శిక్షణా కార్యక్రమాలు అవసరమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శ్రీశైలం ఐటీడీఏ పీఓ డాక్టర్.బి.రవీంద్రారెడ్డితో కలిసి అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. శ్రీశైలం, ఎర్రగొండపాలెంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా గిరిజన యువతకు శిక్షణ ఇచ్చినట్లు ఎండీకి పీఓ వివరించారు. వివిధ శిక్షణల కోసం ఇప్పటికే ఖర్చు చేసిన నగదును ప్రభుత్వం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎండీ వినోద్ కుమార్‌ను పీఓ కోరారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓ పి.మురళీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లతాతిప్పిరెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి

ఆత్మకూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యపకురాలు, వైస్ ప్రిన్సిపాల్ బి పద్మావతిబాయి సూచించారు. శుక్రవారం కళాశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ఏడాది థీమ్ ఇన్‌వెస్ట్ ఇన్ అవర్ ప్లానెట్ ప్రాజెక్టు అవర్ ఫ్యూచర్ అని తెలిపారు. చెత్తను తీయడం, మొక్కలు నాటి సంరక్షించడం వంటి కార్యకలాపాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాసాగర్, చంద్రశేఖర్, చామశేఖర్, శివరామిరెడ్డి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నందికొట్కూరు: పట్టణంలోని నీలిషికారిపేటలో 200 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. టౌన్ సీఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు.. సారా తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు సోదాలు నిర్వహించారు. సారా తయారు చేస్తున్న నీలిషికారి అంబమ్మ, వినోదు, రాందాసులను అరెస్టు చేయగా, శివాజీ పరారయ్యాడు. 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సోదాల్లో ఎస్‌ఐ ఎన్వీ మరణ, పోలీసులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీ, లింగాలగట్టు గ్రామాల్లో ఆదివారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు భరత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పౌష్టికాహారం అందించాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణు, బాలింతలకు మెనూ ప్రకారం నాణ్యమైన గుడ్లు, పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ మంజులవాణి సూచించారు. శుక్రవారం తాటిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఈఓపీఆర్డీ మణిమంజరితో కలిసి ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలో మెనూ చార్టును, ఆహారపదార్థాలను పరిశీలించారు. కొన్ని గుడ్లు పాడైనట్లు గుర్తించిన పక్కన పెట్టించారు. చిన్నారులకు నాణ్యమైన గుడ్లను ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్త ఇందిరమ్మకు సూచించారు. అనంతరం గ్రామసచివాలయాన్ని పరిశీలించారు. విధులకు సకాలంలో హాజరవ్వాలని సూచించారు. సచివాలయం, ఆర్బీకే భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇంటి, కుళాయి పన్నులు వందశాతం పూర్తిచేయాలని ఆదేశించారు.

విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

వెలుగోడు: మే 7న పట్టణంలో నిర్మిస్తున్న లక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అలువేలు మంగ పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కావాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్లాని వెంకట సత్యనారాయణ ఆహ్వాన పత్రిక అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

వ్యక్తిపై కొడవలితో దాడి

నందికొట్కూరు: కుటుంబ సమస్యల కారణంగా మారుతీ నగర్‌కు చెందిన ఓ వ్యక్తిపై మరొకరు కొడవలితో దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాలు.. అక్బర్ కుమారుడు షేక్‌షా, ముర్తుజా కుమారుడు వజీర్ కుటుంబాలు మారుతీ నగర్‌లోనే పక్కపక్కనే నివాసం ఉన్నాయి. ఈ రెండు కుంటుబాల సభ్యులు గతంలో హైదరాబాద్‌లో కొంత కాలం జీవనం సాగించారు. అ సమయంలో కుటుంబ గొడవలు చోటుచేసుకున్నాయి. వీటిని మనసులో ఉంచుకుని షేక్ షాలుపై షేక్ వజీర్ దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ లీలావతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు కేంద్రం-17 ఆయా పోస్టుకు బీసీ-డీ, కేంద్రం-24కు బీసీ-ఈ, బండి ఆత్మకూరు మండలం బోధనం కేంద్రం బీసీ-బీ, మహానంది మండలం మసీదుపురం కేంద్రం-2 ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు అర్హులన్నారు. అలాగే మహానంది మండలం గోపావరం కేంద్రం -1 కార్యకర్త పోస్టుకు బీసీ-బీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- నందికొట్కూరు: మండల, పట్టణ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-14లో హెల్పర్ పోస్టు బీసీ-సీ, శాతనకోట కేంద్రం-3లో బీసీ-బీ, కొణిదేల కేంద్రం-2లో ఓసీ, పగిడ్యాల మండలం నెహ్రూనగర్ కేంద్రం-3 ఓసీ, మిడుతూరు కేంద్రం-1 ఈడబ్ల్యూఎస్, సున్నంపల్లి బీసీ-డీ, దేవనూరు కేంద్రం-1 ఎస్సీ అభ్యర్థులు అర్హులన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు: ఈ నెల 28న జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖ అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ శోభరాణి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

కర్తవ్య దీక్షను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంవీ రమణారెడ్డి

వెలుగోడు/మహానంది: ఈనెల 24న కర్నూలు జిల్లా కేంద్రంలోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రాయలసీమ కర్తవ్య దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నంద్యాల జిల్లా నాయకులు ఎంవీ రమణారెడ్డి కోరారు. శుక్రవారం వెలుగోడు మండలం మోతుకూరు. మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురం గ్రామాల్లో దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంవీ రమణారెడ్డి మాట్లాడుతూ సీమను కరువు కోరల్లోకి నెట్టే అక్రమ ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపాలన్నారు. రాయలసీమకు నీళ్ల, నిధులు, నియామకాలు సమానంగా కేటాయించాలని కోరారు. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిపై తీగల వంతెనకు బదులు బ్యారేజ్ కం బ్రిడ్జి నిర్మించాలని కోరారు. సమావేశంలో మోతుకూరు రైతు నాయకులు శ్రీనివాసులు, ఎం.తిమ్మాపురం మాజీ ఉప సర్పంచ్ భానుముక్కల వెంకటరమణగౌడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిపై చర్చ



ఆలయ అభివృద్ధిపై సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధిపై శుక్రవారం అధికారులు, గ్రామస్తులు సమావేశమై చర్చించారు. ఈఓ గుర్రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి, బన్నూరు నాగిరెడ్డి, యరభం సుదర్శన్ రెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి, యరభం ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీటీడీ ద్వారా గాలిగోపుర నిర్మాణానికి మంజూరైన రూ.1.52 కోట్లలో రూ.30 లక్షలతో ఆలయ పనులు ప్రారంభించారు. కాగా మంజూరైన మొత్తానికి జీఎస్టీ చెల్లించాల్సి ఉండటంతో ఆలయ బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తాన్ని వినియోగించాలని ఈఓను మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కోరగా ఆలయ కమిషనర్‌ను సంప్రదించి, ఆయన అనుమతుల మేరకే అంత మొత్తాన్ని డ్రా చేయాల్సి ఉంటుందని, తన చేతిలో మాత్రం ఉండదని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి మూడేళ్ల జమ, ఖర్చుల లెక్కలను చూపించాలని ఈఓను కోరగా ఆయన అందుకు అంగీకరించారు. అలాగే ఈ ఏడాది బ్రహ్మోత్సవాల నిర్వహణకు గ్రామ కమిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పట్టుబడిన విద్యుత్ తీగ దొంగలు








రైతులకు పట్టుబడిన అనుమానితులు

జూపాడుబంగ్లా: పొలాల్లోని వ్యవసాయ మోటార్ల వద్ద విద్యుత్ తీగలు చోరీకి పాల్పడుతున్న దొంగలకు రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రైతులు తెలిపిన వివరాలు.. ఇద్దరు మహిళలు, ఓ యువకుడు శుక్రవారం మధ్యాహ్నం తూడిచెర్ల గ్రామ పరిధిలోని పాశ్వాన్‌వంక సమీప పొలాల్లో విద్యుత్ మోటార్ల తీగలను కట్‌చేస్తుండగా ఓ రైతు గమనించాడు. దగ్గరకు వెళ్లి నిలదీయగా రైతుపై దాడికి యత్నించారు. మరో రైతు అక్కడికి చేరుకోవడంతో దొంగలను నిలువరించారు. కాసేపటికే మరికొంతమంది రైతులు పోగై నిందితుల సంచులను గాలించగా విద్యుత్ వైర్లు బయట పడ్డాయి. ఎంత గద్దించినా వివరాలు చెప్పకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. కాగా మూడు రోజుల క్రితం విద్యుత్ మోటార్ల దొంగలు దోర్నాల కిన్నెరబాబు, మేరిబాబు, పి.లింగాపురం రాజేష్‌లను కూడా ఇదే తూడిచెర్ల గ్రామ రైతులు పట్టుకుని జూపాడుబంగ్లా పోలీసులకు అప్పగించారు. దొంగల నుంచి ఇప్పటి దాకా 14 మోటార్లను రికవరీ చేసినట్లు సమాచారం. తంగడంచ, తూడిచెర్ల, పి.లింగాపురం, తరిగోపుల, రామసముద్రం, మండ్లెం, తర్తూరు తదితర గ్రామాల పరిధిలో దాదాపు 100 మోటార్లు చోరీకి గురయ్యాయని, ఇకపై నుంచైనా చోరీలు జరగకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.



స్వాధీనం చేసుకొన్న విద్యుత్ తీగలు

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు రాజేష్, వర్ధన్, నాని, రాజు, తదితరులు కోరారు. శుక్రవారం వారు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

వర్షబీభత్సం

- నేలవాలిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు



శివపురం - లింగాపురం మధ్యలో రహదారికి అడ్డంగా విరిగిన చెట్లు

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. అక్కడక్కడా చెట్లు విరిగిపడ్డాయి. ఆత్మకూరు - సంగమేశ్వరం రహదారిలో ఎస్ రంగాపురం, శివపురం గ్రామాల మధ్య కొండమ్మ తోట వద్ద చెట్లు రహదారికి అడ్డంగా విరిగిపడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గువ్వలకుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో స్తంభం విరిగిపడింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో కాలనీలో అంధకారం నెలకొంది. మీసాల వెంకటరెడ్డి రైతుకు చెందిన పశువుల రేకుల షెడ్డు ఈదురుగాలులకు నేలమట్టమైంది.



గువ్వలకుంట్లలో విరిగిన స్తంభం, నేలవాలిన చెట్టు

కురిసింది వాన

పాములపాడు: మండలంలోని శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆరు బయట, కల్లాల్లో రైతులు ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోయింది.



పాములపాడులో ఎండుమిర్చి కుప్పపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

ఆత్మకూరు: ఆత్మకూరు, కరివేన, నల్లకాల్వ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం పెనుగాలులతో భారీ వర్షం కురిసింది. మండు వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఆత్మకూరు పట్టణంలో దాదాపు 41.2 డిగ్రీ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమికి ఆందోళన చెందుతున్న సమయంలో వర్షం కురవడంతో చల్లదనం ఏర్పడింది.